నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంచిర్యాల, బుధవారం 27 మార్చి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

సోమగూడెం చెక్‌పోస్టు వద్ద రూ. లక్ష స్వాధీనం

కాసిపేట, మార్చి 26 : కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం చొప్పరిపల్లి సమీపంలోని పోలీస్ చెక్‌పోస్టు వద్ద కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం వాహనాల తనిఖీలు చేపట్టారు. గోలేటికి చెందిన అప్పం మల్లేశ్ వద్ద రూ.54,700, రవీంద్రనగర్‌కు చెందిన మాచర్ల రాకేశ్ వద్ద రూ.51, 000 స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాసిపేట : నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

ముఖరాం చౌరస్తాలో కూలీలను కలిసి ఓట్లు అభ్యర్థిస్తున్న కొప్పుల ఈశ్వర్

పకడ్బందీగా పార్లమెంట్ ఎన్నికలు

- ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూస్తాం
- సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం
- ప్రాణహిత నదీ తీరం వెంట పహారా కాస్తున్నాం
- అక్రమ దందాలపై ఉక్కుపాదం మోపుతాం
- తప్పు చేస్తే ఎంత పెద్దవారైనా సరే వదిలిపెట్టం
- 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక ఇంటర్వ్యూలో రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్

తెలంగాణలోని 17 పార్లమెంట్ స్థానాలకు మే 13న ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఓటర్లను ప్రభావితం చేసే నగదు, మద్యం పంపిణీపై పోలీసుల నిఘా పెరిగింది. అనేక ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయగా, 24 గంటల పాటు తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పోలీస్ యంత్రాంగం సన్నద్ధతపై రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ 'నమస్తే తెలంగాణ'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికలు పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు చెప్పారు. మంచిర్యాల జిల్లాలో సాగుతున్న అక్రమదందాలపై ఉక్కుపాదం మోపుతామని, ఎంత పెద్దవారైనా సరే వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు.

- మంచిర్యాల, మార్చి 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

నమస్తే : పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఎన్నికల కోసం పోలీస్ యంత్రాంగం సన్నద్ధత ఎలా ఉంది?

సీపీ : పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. పార్లమెంట్ పరిధిలో సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేందాలు 104 వరకు ఉన్నట్లు గుర్తించాం. మహారాష్ట్ర బార్డర్‌లో ప్రాణహిత నదీ తీరం పక్కనున్న కోటపల్లి, నీల్వాయి, వేమనపల్లి, నెన్నెల ప్రాంతాల్లో ఈ కేంద్రాలు ఉన్నా యి. ఈ సమస్యాత్మక ప్రాంతాలన్నింటినీ ఇప్పటికే విజిట్ చేశాం. ప్రాణహిత బార్డర్‌తో మహారాష్ట్రలోని గడ్చిరోలి ఏరియా వరకు వెళ్లాం. ప్రాణహితపై 12 ఫ్రీ పాయింట్స్ (నది దాటుకొని మన ఏరియాలోకి వచ్చేందుకు అవకాశం ఉన్నవి) ఉన్నాయి. వాటన్నింటినీ చెక్ చేశాం. ఆ రూట్స్ ద్వారా ఎవరు తెలంగాణలోకి ప్రవేశించినా వెంటనే మాకు తెలుస్తుంది.

నమస్తే : ఈ మధ్య గడ్చిరోలిలో నలుగురు మావోల ఎన్‌కౌంటర్ జరిగింది. దీంతో ఎన్నికలకు మావోయిస్టుల నుంచి ముప్పు ఉందనే ప్రచారం జరుగుతుంది. దీనిపై మీరు ఏమంటారు.?

సీపీ : ఎన్‌కౌంటర్‌తో నలుగురు మావోయిస్టులు చనిపోయారు. మన నిఘా వ్యవస్థ ఇచ్చిన సమాచారంతోనే వారిని గడ్చిరోలి పోలీసులు ట్రాక్‌చేశారు. ప్రాణహిత నదీ తీరం వెంట ఏ గ్రామాల్లో మావోయిస్టులు షెల్టర్ తీసుకుంటారు. వాళ్ల వస్తువులు డంప్ చేసుకొని వెళ్తారనే సమాచారం ఉందో ఆయా గ్రామాల్లో ఇప్పటికే కార్డన్ సెర్చ్ పూర్తి చేశాం. అక్కడ ఏం జరిగినా మాకు సమాచారం వచ్చేలా ఏర్పాట్లు ఉన్నాయి. పైగా బార్డర్‌లో పెద్ద డ్రోన్ కూడా ఉంది. పిన్ పాయింటెండ్ లొకేషన్‌ను సైతం అది ట్రాక్ చేయగలదు. కిలోమీటరున్నర ఎత్తులో దాన్ని ఆపరేట్ చేయొచ్చు. ఏకే-47తో కాల్చిన దాన్ని కొట్టడానికి రాదు. ఆ డ్రోన్‌కు హై రిజల్వేషన్ కెమెరాలు ఉన్నాయి. వాహనం, మనషులను సైతం అది ట్రాక్ చేస్తుంది. సీపీ ఆఫీసులో కూర్చొని అక్కడ ఏం జరుగుతుందో చూసేలా అది పని చేస్తుంది. ఇక థిక్ ఫారెస్ట్‌లో స్పెషల్ పార్టీలను డిప్లాయ్ చేశాం. ప్రాణహితకు సౌత్ సైడ్ ఒక పార్టీ, నార్త్ సైడ్ ఒక పార్టీ మొత్తం 25 కిలోమీటర్ల వరకు నిత్యం తిరుగుతున్నాయి. మావోల ఎన్‌కౌంటర్‌లో మంగి-ఇంద్రవెల్లి డివిజన్ కమిటీ సెక్రటరీ, సిర్పూర్-చెన్నూర్ డివిజన్ కమిటీ సెక్రటరీలు ఇద్దరు సహా మరో ఇద్దరు కీలకమైన మావోయిస్టులు మృతి చెందారు. దీంతో ఆ రెండు దళాలు పూర్తి గా పోయాయి. కొన్ని రోజుల క్రితం గడ్చిరోలి అధికారులతో ఒక మీటింగ్ పెట్టాం. అది చాలా బాగా ఉపయోగపడుతుంది. రానున్న రోజుల్లో మహారాష్ట్ర పోలీసుల సహకారంతో ముందుకు వెళ్తాం.

నమస్తే : ఎన్నికల కోసం ప్రత్యేక బలగాలను ఏమైనా మోహరిస్తున్నారా..?

సీపీ : అవును.. మంచిర్యాల ఏరియాకు ఒక కంపెనీ వచ్చింది. ఈ మేరకు మంచిర్యాలలో గతంలోనే ఫ్లాగ్‌మార్చ్ కూడా అయిపోయింది. గోదావరిఖనికి సంబంధించి రెండో కంపెనీ కూడా వచ్చింది. ఒక్కో కంపెనీలో 90 నుంచి 91 మంది ఆర్మ్‌డ్ వెపన్స్ కలిగిన ఫోర్స్ ఉంది. అవసరాన్ని బట్టి మరిన్ని బలగాలను, సివిల్ ఫోర్స్‌ను వాడుకుంటున్నాం. అలాగే ప్రాణహిత బార్డర్‌లో స్పెషల్ పార్టీలు సైతం రోజూ తిరుగుతున్నాయి. 6 పార్టీలు కేవలం బార్డర్ వెంటే మోహరించి ఉన్నాయి. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

నమస్తే : పార్లమెంట్ పరిధిలో ఎన్ని చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు నగదు, మద్యం ఏమైనా పట్టుకున్నారా..?

సీపీ : మొత్తం పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో 21 ఎస్ఎస్‌టీ (స్టాటిక్ సర్వేలైన్ టీమ్)లు చెక్‌పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతానికి సివిల్ ఫోర్స్‌తో వాటిని నడిపిస్తున్నాం. కంపెనీల నుంచి వచ్చిన సిబ్బంది ప్రస్తుతం సబ్ డివిజన్‌లోని క్రిటికల్ పోలింగ్, మావోయిస్టు ఎఫెక్టెడ్ పోలింగ్ సెంటర్లలో తిరుగుతున్నారు. వారికి మన ప్రాంతంపై సంపూర్ణమైన అవగాహన వచ్చాక 29వ తేదీ నుంచి ఎస్ఎస్‌టీ బాధ్యతలు అప్పగిస్తాం. ఇక ప్రతి రోజూ ఐడీ లిక్కర్, ఐఎంఎఫ్ఎల్ లిక్కర్ పట్టుకుంటున్నాం. ఇప్పటి వరకు లక్షల రూపాయాల క్యాష్ కూడా సీజ్ చేశాం. ఇక ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే గిఫ్టులవంటివి ఏం రాలేదు. బైండోవర్స్ అవుతున్నాయి. ప్రతి రోజూ 15 నుంచి 20 మంది వివిధ కేసుల్లో వచ్చి బైండోవర్ అవుతున్నారు. నాన్ బెయిలెబుల్ ఆర్డర్స్ కూడా అవుతున్నాయి. లైసెన్సుడ్ వెపన్స్ కూడా హ్యాండ్ ఓవర్ చేయాలని అందిరికీ సూచించాం. అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పకడ్బందీగా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తాం.

నమస్తే : మంచిర్యాల జిల్లాలో అక్రమ ఇసుక, పీడీఎస్ బియ్యం రావాణా నిత్యం జరుగుతూనే ఉంటుంది. పోలీసు డిపార్ట్‌మెంట్ నుంచి వీటిని అరికట్టేందుకు ఏమైనా చర్యలు తీసుకుంటున్నారా..?

సీపీ : నేను సీపీగా బాధ్యతలు తీసుకున్న దగ్గరి నుంచి పీడీఎస్ బియ్యం ప్రతి రోజూ పట్టుకుంటున్నాం. కేసులు కూడా పెడుతున్నాం. రేషన్ బియ్యం ఎవ్వరూ తినడం లేదని, అందుకే తరలిస్తున్నారని తెలిసింది. గవర్నమెంట్ ఇచ్చిన బియ్యా న్ని తినకుంటే ఇష్టం వచ్చినట్లు దోచుకుపోతాం అనడం సరి కాదు. సివిల్ సప్లైయ్ అధికారులు ఈ విషయంపై దృష్టి పెట్టా లి. సివిల్ సప్లైయ్ అధికారులు, రెవెన్యూ అధికారులు ఎమైనా ఫిర్యాదులు ఇస్తే వెంటనే కేసులు పెడతాం. ఇప్పటి దాకా పీడీఎస్‌పై 60 నుంచి 70 కేసులు నేను వచ్చాకే అయ్యాయి. ఇక ఇసుక అక్రమ రవాణాపై సైతం కేసులు కూడా పెడుతున్నాం. రెవెన్యూ, మైనింగ్ అధికారులకు దీనిపై పూర్తి బాధ్యత ఉంటుంది. నిబంధనలు అతిక్రమిస్తే ఎవ్వరైనా సరే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

నమస్తే : మంచిర్యాల జిల్లాలో చిట్‌ఫండ్, ఫైనాన్స్ మోసాలు ఎక్కువవుతున్నాయి. ఇవి మీ దృష్టికి వస్తున్నాయా..?

సీపీ : ఈ మధ్య కాలంలో చిట్‌ఫండ్‌లో మోసపోయిన వారు వచ్చి కలిశా రు. ఎవరైనా సరే చిట్‌ఫండ్ రిజిస్ట్రేషన్ యాక్ట్ ప్రకారం నడుచుకోవాలి. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై తప్పకుండా పీడీ యాక్ట్ పెడుతాను. వాడు ఒక్కడు కా నీ, వంద మంది కానీ. పెద్దోళ్లు కానీ, చిన్నోళ్లు కానీ చట్టం ముందు అందరూ సమానమే. నాకు తెలిసింది ఏమిటంటే సింగరేణి, ఎన్‌టీపీసీలో పని చేసే ఉద్యోగులకు అధిక మొత్తాలు ఫైనాన్స్ ఇస్తున్న కొందరు ఉద్యోగుల ఏటీఎం కార్డులు తీసుకొని దగ్గర పెట్టుకుంటున్నారట. జీతం పడిందని వచ్చి ఉద్యోగులు చెప్పగానే ఆ నెల ఈఎంఐకి సరిపడా విత్‌డ్రా చేసుకొని మిగిలింది ఉద్యోగులకు ఇచ్చి పంపిస్తున్నట్లు తెలిసింది. ఇలాంటివి ఏమైనా నా నోటీస్‌కు వస్తే మొత్తం దుకాణమే బంద్ చేస్తా. ఐపీసీ, పీడీ యాక్ట్ కింద కేసులు పెడుతాం. ఒక్క ఫిర్యాదు వచ్చి నా చాలు కఠినమైన చర్యలు తీసుకుంటాం. ఇది నా హెచ్చరికగా అందరికీ చెప్తున్నా..

నమస్తే : భూ అక్రమణలపై మీరు చాలా సీరియస్‌గా ఉన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి అక్రమాలు చేసే వారిపై ఎలాంటి చర్యలు ఉంటాయి.?

సీపీ : నాన్ లే-అవుట్స్, భూముల ఆక్రమణలతో చాలా లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్స్ వస్తాయి. అందుకే అంత సీరియస్ వార్నింగ్ ఇవ్వాల్సి వచ్చింది. ఎవ్వరైనా సరే అప్రూవుడ్ బై డీటీసీపీ లేకపోతే ఆ లే-అవుట్ ప్లాట్స్ కొననే కొనొద్దు. అది పూర్తిగా ఇల్లీగల్. ఫామ్ ల్యాండ్స్ క్రయవిక్రయాలు సైతం ఇల్లీగలే. ఇదో పెద్ద దం దా నడుస్తుందని తెలుస్తుంది. ఇలాంటి కేసుల్లో ఎవ్వరు మోసం చేసిన ఫిర్యాదు చేయండి. వెంటనే చర్యలు తీసుకుంటాం. ఈ విషయంలో ఎవ్వరికీ మినహాయింపు లేదు.

నమస్తే : పట్టణాలతో పాటు మారుమూల గ్రామాల్లోనూ గంజాయి సులభంగా దొరుకుతుందనే సమాచారం అందుతోంది. ఇది మీ దృష్టికి వచ్చిందా.?

సీపీ : మీరన్నంత తీవ్రంగా కాకపోయినా గంజాయి ప్రాబ్లమ్ ఉంది. యువత ఎక్కువగా గంజాకు అడిక్ట్ అవుతున్నారు. అయితే గంజా ఎక్కడి నుంచి వస్తుందనే సోర్స్ కోసం చూస్తున్నాం. ఇప్పటికే మా టీమ్ వర్కవుట్ చేస్తుంది. కొందరిని గుర్తించాం. పక్క జిల్లాల్లోని డీప్ ఏరియాలో పండించే వాళ్లు ఉన్నారు. అక్కడి నుంచి మనకు వస్తుంది. వాడుతున్న వారిని పట్టుకుంటే ఉపయోగం లేదు. అందుకని వాళ్లకు స్టాక్ సప్లయ్ చేసే వాళ్లపై దృష్టి పెడుతున్నాం. మెయిన్ సోర్స్ కటాఫ్ చేస్తే వాడకం తగ్గుతుంది. యువతను దీనిపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు సైతం ప్లాన్ చేస్తున్నాం. త్వరలోనే ఆ వివరాలు వెల్లడిస్తాం.

కాంగ్రెస్ ఓ డ్రామా కంపెనీ

ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా నాటకాలు

- ఎన్నికలప్పుడు వచ్చే నాయకులను నమ్మొద్దు
- కాళేశ్వరంలో ఒక్క పిల్లర్ దెబ్బ తిందన్న సాకుతో మొత్తం రైతాంగానికి తీవ్ర అన్యాయం
- బీఆర్ఎస్‌ను గెలిపించి.. హస్తం పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలి
- బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- మంచిర్యాలలో మార్నింగ్ వాకర్స్, కూలీలను కలిసి ఓట్లు అభ్యర్థన
- నాయకులతో కలిసి అల్పాహారం
- కారుకు భారీ మెజార్టీ రావాలి
- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, మార్చి 26 : ''కాంగ్రెస్.. ఓ డ్రామా కంపెనీ. ఆరు గ్యారెంటీలు అమలు చేయకుండా ఎన్నికల కోడ్ అంటూ నాటకాలు ఆడుతున్నది. ప్రజలు ఆ పార్టీ మోసాలను గమనించాలి. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలి.' అని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం మంచిర్యాలలోని కాలేజీరోడ్డు, బాలుర పాఠశాలలో మార్నింగ్ వాకర్స్‌ను మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి మాట్లాడారు. ఆపై డిగ్రీ కాలేజీ మైదానంలో స్థానికులతో కలిసి మెడిటేషన్ చేశారు. లేబర్‌అడ్డాలోని కూలీలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అంతకు ముందు పాత గర్మిళ్లలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆర్‌పీ రోడ్‌లోని టిఫిన్ సెంటర్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అనంతరం కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ ఎన్నికలు వస్తున్నాయని వలస నాయకులు, వీకెండ్ వీరులు వస్తున్నారని, వారి ఆస్తుల కోసం, పరిశ్రమల రక్షణకోసం పరితపిస్తారే తప్ప ప్రజలకు చేసేదేమీ ఉండదన్నారు. 26 ఏళ్లుగా సింగరేణిలో కార్మికుడిగా పనిచేశానని, ఇక్కడి ప్రజల కష్టాలు, ఇబ్బందులు తెలుసునని, అందరికీ అందుబాటులో ఉండి సేవ చేసుకుంటానని చెప్పారు. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చలేకుండా ఉన్నానని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అస్థిత్వాన్ని కాపాడుకోవడం కోసం ప్రతి ఒక్కరూ కారుగుర్తుకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలు అమలు చేశామని, తెలంగాణను అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపామని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే జరిగిన పరిణామాలను గుర్తించి ప్రజలు మంచి నిర్ణయం తీసుకోవాలని, ఎంపీ ఎన్నికల్లో కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. కాళేశ్వరంలో ఒక్క పిల్లర్ కూలిందన్న సాకుతో మొత్తం రైతాంగానికి తీరని అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. అతి తక్కువ కాలంలో ఫెయిలైన ప్రభుత్వం ఏదైనా ఉందంటే, అది కేవలం రేవంత్‌రెడ్డి ప్రభుత్వమేనని చెప్పుకొచ్చారు.

భారీ మెజార్టీతో గెలిపించాలి : మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

అందరికీ సుపరిచితుడైన కొప్పుల ఈశ్వర్‌ను పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పిలుపునిచ్చారు. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తిగా, ఇక్కడి సమస్యలు, అవసరాలు తెలిసిన వ్యక్తిని ఎంపీగా గెలిపించుకుంటే ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్మిక నాయకుడిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. ఈ మధ్య కాలంలో ఇష్టారాజ్యంగా కేంద్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందని, ప్రతిపక్ష నాయకులను జైళ్లలో పెడుతున్నారని, ప్రతిపక్షం అనేదే లేకుండా చేస్తున్నారని, ఇదంతా ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలన్నీ మరచి, నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని, ముఖ్యమంత్రి హోదాలో ఉండి బీఆర్ఎస్ పార్టీ నాయకులను అనరాని మాటలు అంటున్నారని మండిపడ్డారు. రైతు రుణమాఫీ, మహిళలకు రూ. 2500, రైతుబంధు, రూ. 500 బోనస్, తదితర హామీలిచ్చి మోసం చేసిందన్నారు. వరి పొలాలు ఎండిపోతున్నా ప్రభుత్వానికి పట్టింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, కౌన్సిలర్లు అంకం నరేశ్, గాదెసత్యం, నాయకులు సందె ల వెంకటేశ్, సుంకరి రమేశ్, తాజొద్దీన్, సుధీర్, శ్రీపతివాసు, శ్రీరాముల మల్లేశ్ పాల్గొన్నారు.

మొదటి దశ ర్యాండమైజేషన్ పూర్తి

మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

నస్పూర్, మార్చి 26 : లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ మొదటి దశ ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల శాసనసభ నియోజకవర్గాల్లో జరగనున్న ఎన్నికల కోసం పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్‌ను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఇందులో 1131 మంది ప్రిసైడింగ్ అధికారులు, 1111 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 2187 మంది ఇతర ప్రిసైడింగ్ అధికారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఇక్కడ ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, ఈ డిస్ట్రిక్ మేనేజర్ సునీల్ పాల్గొన్నారు.

ఎన్నికల యాప్‌లను వినియోగించుకోవాలి

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

మాట్లాడుతున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్ టౌన్,మార్చి 26 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ఎన్నికల యాప్‌లను రాజకీయ పార్టీలు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ(స్థానిక సంస్థలు), దాసరి వేణు(రెవెన్యూ), జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్‌తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణ కోసం రూపొందించిన సువిధ, సీ-విజిల్, 1950 యాప్‌లను ఉపయోగించుకోవాలని, ఎన్నికల నిర్వహణలో అభ్యంతరాలుంటే ఫిర్యాదులు, ఇతర ఎన్నికల సంబంధిత సమస్యలుంటే యాప్‌లు, కంట్రోల్ రూమ్(08733-2790 33)లో సంప్రదించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు మధుకర్ పాల్గొన్నారు.

మొదటి దశ ర్యాండమైజేషన్‌కు ఏర్పాట్లు

ఆసిఫాబాద్ టౌన్,మార్చి 26 : లోక్ సభ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియకు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సిర్పూర్, ఆసిఫాబాద్ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు దీపక్ తివారీ, దాసరి వేణుతో కలిసి జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్, నోడల్ అధికారి (మ్యాన్ పవర్) అశోక్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్ పాండేతో కలిసి ర్యాండమైజేషన్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మొదటి దశలో 3,973 మందికి ర్యాండమైజేషన్ చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు కేటాయించిన విధుల్లో సవరణల కోసం జిల్లా ఎన్నికల అధికారికి దరఖాస్తు రూపంలో అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ - డిస్ట్రిక్ట్ మేనేజర్ గౌతమ్ రాజు, నేషనల్ ఇన్ఫర్మేషన్ సిబ్బంది శ్రీకాంత్, రాజ్‌కుమార్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపే ధ్యేయం

సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దండె విఠల్

- ప్రజా సమస్యలపై పోరాడుదాం
- కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుదాం
- ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్

దహెగాం, మార్చి 26 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపే ధ్యేయంగా కష్టపడుదామని ఎమ్మెల్సీ దండె విఠల్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పోరాడుదామని, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుదామన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు మొక్కవోని దీక్షతో గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. ఈ నెల 28న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కాగజ్‌నగర్‌కు రానున్నారని, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ నాయకులు ఎల్కరి ప్రశాంత్, షాకీర్, బాలూ నాయక్, నాగుల లక్ష్మి పాల్గొన్నారు.

తుపాకులు సరెండర్ చేయాలి

రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, మార్చి 26: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో లైసెన్స్ కలిగిన తుపాకులను సరెండర్ చేయాలని రామగుండం పోలీసు కమిషనర్ ఎం శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆయుధాల చట్టం 1959 సెక్షన్ 21 ప్రకారం కమిషనరేట్ పరిధిలో నివసిస్తూ లైసెన్స్ తుపాకులు కలిగిన ఉన్నవారు సమీప పోలీస్టేషన్‌లలో డిపాజిట్ చేయాలని తెలిపారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా, ఎలాంటి హింసాత్మక ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా ఆయుధాలు డిపాజిట్ చేయాలని కోరారు. డిపాజిట్ చేయని వారిపై కేసులు పెట్టేందుకు వెనుకాడబోమని, ఎన్నికల పక్రియ ముగిసిన తర్వాత వచ్చే జూన్ 7వ తేదీకల్లా తీసుకోవచ్చని తెలిపారు. ఈ విషయంలో జాతీయ బ్యాంకులు, ప్రభుత్వ రంగసంస్థల్లో పనిచేసే భద్రతా సిబ్బంది, గార్డు డ్యూటీలో ఉన్న వారికి మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

సీసీ రోడ్లు.. పగుళ్లే పగుళ్లు

- కాంట్రాక్టర్ల ధన దాహానికి మూణ్నాళ్ల ముచ్చటగా రోడ్లు
- నాణ్యతను పట్టించుకోకుండా ఆగమాగం పనులు
- నెలైనా గడవకముందే అక్కరకు రాకుండా పోతున్నవైనం
- కోట్లాది ఈజీఎస్ నిధులు వృథా
- పట్టించుకోని అధికారులు

ఇది కౌటాల మండలం తలోడి గ్రామంలో రూ. 5 లక్షలతో వేసిన సీసీ రోడ్డు. పదికాలాల పాటు నాణ్యతగా ఉండాల్సింది పోయి.. నెలైనా గడవకముందే పగుళ్లు తేలింది. కాంట్రాక్టర్ల ధన దాహానికి లక్షలాది రూపాయలు వృథా అవుతున్నాయనడానికి ఇదే చక్కని ఉదాహరణ. ఈ ఒక్క రోడ్డే కాదు.. జిల్లాలో అనేకచోట్ల ఇలాంటి దుస్థితే కనిపిస్తున్నది.

పగుళ్లు తేలిన కౌటాల మండలం తలోడిలోని సీసీ రోడ్డు

కుమ్రం భీం ఆసిఫాబాద్, మార్చి 26 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఈజీఎస్ నిధుల తో వేస్తున్న సీసీ రోడ్లు ముణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. నెల రోజులైనా గడవకముం దే పగుళ్లు తేలుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా పనులు పూర్తిచేయాలనే లక్ష్యం తో కాంట్రాక్టర్లు నాణ్యతను పట్టించుకోకుండా హడావుడిగా పనులు చేసేసి చేతులు దులుపుకుంటుండగా, అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ. 11 కోట్లు.. 519 సీసీ రోడ్లు

జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా ఈ ఏడాది రూ. 11 కోట్లతో 519 సీసీ రోడ్లు మం జూరయ్యాయి. ఆర్థిక సంవత్సరం ముగి సే రెండు నెలల ముంద